క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శివాజీ

చీమకుర్తి: మండలంలోని పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ కే శివాజీ చేతుల మీదుగా గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పూనాటి వెంకట్రావు ఆర్థిక సహకారంతో నోట్ పుస్తకాలు అందించారు. అనంతరం పూనాటి వెంకట్రావును శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే శిలార్‌సాహెబ్, ఇస్తర్ల ఏడుకొండలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలల వివరాలు అడగడంపై హర్షం

ఒంగోలు: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎయిడెడ్ పాఠశాలల్లో యుడైస్‌లోని విద్యార్థులు, ఎయిడెడ్ పోస్టుల వాస్తవ వివరాలను ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పరిశీలించి పంపాలని డీఈవో డి.సుభద్ర అడగడంపై ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొమరోలులో పది మంది, కంభంలో ఆరుగురు, గిద్దలూరు మండలంలో 11 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వారిని కూడా ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని వారు కోరారు.

సీనియర్ సిటిజన్స్‌కు హెల్మెట్ నిబంధన తొలగించాలి

ఒంగోలు: నగరాలు, పట్టణాల్లో సీనియర్ సిటిజన్స్‌కి హెల్మెట్ నిబంధన సడలించాలని ఏపీ హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని హైకోర్టు ఆదేశించిన మీదట సీనియర్ సిటిజన్స్‌కు మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. డ్రైవింగ్ చేతకానివారు, హైవేలలో ప్రయాణం చేసే సమయాలలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సీనియర్ సిటిజన్స్ పట్టుమని 20 కిలోమీటర్ల దూరం కూడా వెళ్లరని, వారు హెల్మెట్ పెట్టుకుంటే కనబడదు, వినబడదని, అందువలన వారికి హెల్మెట్ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

నాణ్యమైన విద్యాప్రమాణాలకు కృషి



విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు అందిస్తున్న కరస్పాండెంట్ సుధాకర్ సూరి

చీమకుర్తి: విద్యార్థులకు నాణ్యమైన విద్యాప్రమాణాలు అందించేందుకు తమ పాఠశాల యాజమాన్యం కృషి చేస్తోందని ఆర్.ఎల్.పురం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల కరస్పాండెంట్ వై.సుధాకర్‌సూరి తెలిపారు. గ్రానైట్ వ్యాపారవేత్త నూనె సుబ్రహ్మణ్యం ఆర్థిక సహకారంతో గురువారం విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నూనె సుబ్రహ్మణ్యం పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టీ సుచేత దాయామణి, స్థానికులు పాల్గొన్నారు.

29 నుంచి మహారుద్రపీఠం వార్షికోత్సవం

పీసీపల్లి: మండలంలోని పెద ఇర్లపాడు మహారుద్రపీఠం 1116 శివలింగాల శైవక్షేత్రం వార్షికోత్సవం ఈ నెల 29 నుంచి జూలై 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 29న గణపతిపూజ, నవగ్రహ మండపారాధన, లక్ష్మీగణపతిహోమం, రుద్రాభిషేకం, తీర్థప్రసాద వితరణ, 30న మహా మృత్యుంజయ హోమం, బిల్వార్చన, రుద్రాభిషేకం, తీర్థప్రసాద వితరణ, జూలై 1వ తేదీన మహా రుద్రపీఠం శివలింగాలకు అభిషేకం, రుద్రహోమం, పంచామృత అభిషేకం జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నేడు ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

సింగరాయకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేష్‌కుమారి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొనాలని గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో సాయినాథునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి



సాయినాథుని పల్లకి సేవలో కోలాట నృత్య ప్రదర్శన చేస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో: నగరంలోని షిరిడీ సాయిబాబా మందిరాలలో గురువారం సాయినాథునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో, కర్నూలు రోడ్డులోని సాయిబాబా మందిరంలో, హౌసింగ్ బోర్డులోని షిరిడీ సాయిబాబా మందిరంలో, పేర్నమిట్ట బాబా మందిరంలో ఆలయ అర్చకులు ప్రాతఃకాలమున సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో వివిధ రకాల పూలతో సాయినాథునికి అలంకరణ చేశారు. అర్చన, పూజలు నిర్వహించారు. మందిరంలో ఉన్న దత్తాత్రేయస్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ఉదయం ఏడు గంటలకు పాలు, పెరుగు, తేనె, చక్కెర, పన్నీరు, కొబ్బరినీటితో అభిషేకం నిర్వహించి అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. మంగళహారతులతో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఎనిమిది గంటలకు బాబా వారి పల్లకి సేవలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మందిరం చుట్టూ బాబా పల్లకితో తిరుగుతూ మహిళలు కోలాటం, నృత్య ప్రదర్శనతో ఉత్సవంలో పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలన కోసమే విద్యా సేవలు



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ, శాంతకుమారి, అనిత రోజారాణి, గ్రామస్తులు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): పేదరికాన్ని నిర్మూలించడానికే విద్యార్థులకు ఉచిత విద్యా సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. చాపల వంశీకృష్ణ సహకారంతో ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొత్తపట్నం పల్లెపాలెంని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కె.పల్లెపాలెం నార్త్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరిపడా అన్ని రకాల నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ పేదరికాన్ని జయించడానికి చదువే ఆయుధమని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని బలంగా నమ్మి అందరూ చదవాలి, అందరూ ఎదగాలి అనే ఉద్దేశంతో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామంలో విద్యాభివృద్ధి కోసం 2015 నుంచి వివిధ విద్యా సంబంధిత సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం కోసం గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఫొటోలను నోట్ పుస్తకాల కవర్ పేజీ మీద అందంగా ముద్రించి ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉప విద్యాశాఖాధికారిని అనిత రోజారాణి మాట్లాడుతూ గ్రామంలో డాక్టర్ వంశీకృష్ణ దంపతులు విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ శాంతకుమారి, శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల కో ఆర్డినేటర్ చాపల వినుకొండయ్య, మండల విద్యాశాఖాధికారిని పద్మావతి, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి, మూడు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మస్తాన్, కృష్ణప్రసాద్, తిరుమలాబి, ఉపాధ్యాయులు కొక్కిలగడ్డ సుబ్బారావు, నాగేశ్వరరావు, విద్యార్థులు, గ్రామ కాపులు పోతురాజు, హాస్పిటల్ సిబ్బంది నాగరాజు, శ్యామ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక బ్యారన్ల నిర్మాణం నేరం



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎం లక్ష్మణరావు

కందుకూరు: పొగాకు బోర్డు చట్టం ప్రకారం ఎటువంటి అనుమతులు లేకుండా బ్యారన్‌లు నిర్మించడం నేరమని, రైతులు అనుమతులు లేకుండా బ్యారన్‌లు నిర్మించవద్దని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం లక్ష్మణరావు సూచించారు. కందుకూరు రెండో వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఈ వేలం కేంద్రంలో అధికారిక పొగాకు అమ్మకాలు పూర్తయ్యాయని, అనధికారిక పొగాకు అమ్మకాలపై ఇంకా బోర్డు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. త్వరలోనే వీటి అమ్మకాలపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పొగాకు ముక్క, చూర అమ్మకాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ ఉత్పత్తులకు కూడా వ్యాపారులు మంచి ధరలు ఇవ్వాలని, మార్కెట్‌కు అనుగుణంగా రైతులు పొగాకు ముక్కలో తేమ, అధిక వేడి లేకుండా చూసుకోవాలన్నారు. నాణ్యమైన ఉత్పత్తులకు ధరలు అధికంగా వస్తాయని ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పొగాకు ముక్కను అమ్ముకోవాలని కోరారు. అలాగే మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండడం వల్ల రైతులు పొలాలు, బ్యారన్‌లు అధిక కౌలు చెల్లించి లీజుకు తీసుకున్నట్లు గమనించామని దీని వల్ల మార్కెట్ ప్రతికూల పరిస్థితుల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. కావున రైతులు ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచుకోవద్దని హెచ్చరించారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలను విధిగా పొలాల్లో చల్లాలని దీని వల్ల పొలాలు సారవంతమై నాణ్యమైన దిగుబడులు వస్తాయని వివరించారు. అనధికారిక బ్యారన్‌లు నిర్మించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేలం నిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి



వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన గొడ్రాలి కొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 8వ రోజు గురువారం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, ప్రసాద వితరణ పూజలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. అశ్వ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి కొలువుదీరారు. ఆలయం ప్రాగణంలో స్వామి వారిని మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం రాత్రి ఆలయం ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ నాయకులు విద్యుత్ ప్రభపై పాటకచ్చేరిని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చి జై వైఎస్సార్, జై జగన్ అంటూ నినాదాలతో ఈలలు వేస్తూ ఆనందోత్సాహాలతో హోరెత్తించారు. అన్నదాన సత్రం ఆవరణంలో భక్తుల కాలక్షేపానికి సత్యహరిశ్చంద్ర డ్రామాను ప్రదర్శించారు.

బస్సు వసతి కల్పించాలి

దొనకొండ: పొదిలి నుంచి వయా దొనకొండ, చందవరం, త్రిపురాంతకానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వివిధ గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు. గతంలో పొదిలి నుంచి త్రిపురాంతకం బస్సు సౌకర్యం ఉండేది. నేడు బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. మండల ప్రజలు దొనకొండ రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలో ప్రయాణం ప్రమాదాలకు గురవతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేంద్రం పొదిలి నుంచి త్రిపురాంతకానికి మార్చారు. దొనకొండ, ఇతర గ్రామాల ప్రజలు ఆయన దగ్గరకు పనిపై వెళ్లాలంటే బస్సు లేక ఇబ్బంది పడుతున్నారు. ఆటో ప్రయాణాలు ఎన్నో సార్లు ప్రమాదాలకు గురయ్యాయి. అంతేకాకుండా విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రావాలంటే ఆటోలు ఆశ్రయించక తప్పడం లేదు. ఎన్నిసార్లు పొదిలి డిపో వారికి వినతి పత్రం అందజేసినా ప్రయోజనం లేకుండా పోయింది. 3 నెలలకు ఒకసారి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో ఆర్టీసీ సంస్థ అధికారులు హాజరవుతున్నారు. ఎన్నోసార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులు అడిగినా సరే అంటున్నారుగానీ మరుసటి రోజు మరిచి పోతున్నారు.

సీతారామస్వామి కల్యాణం

తర్లుపాడు: మండలంలోని కారుమానుపల్లిలో పట్టాభి సీతారామస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చన, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం, సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి తువ్వపాడులో పండగ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు(దక్షిణం పల్లి) గ్రామంలో సీతాలక్ష్మణ హనుమత్ సహిత రామచంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం గంగానయనం, గోపూజ, గణపతి పూజ కార్యక్రమాలతోపాటు సీతారామచంద్రమూర్తులకు శాంతి కల్యాణం నిర్వహిస్తారన్నారు. శనివారం ఆంజనేయస్వామి ఉత్సవం, సాయంత్రం కుంకుమ బండ్ల ఉత్సవం, ఆదివారం పోలేరమ్మ తల్లికి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు గ్రామంలో అన్నదానం నిర్వహిస్తారన్నారు.

శ్రీవారికి భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో కొలువై ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి షష్టమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఊంజల్ సేవ, ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు టీపీ వెంకటేశ్వర్లు, కొండలరావు, నిట్టూరి వెంకట రమేష్, పిచ్చిరావు, రామారావు, రాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఆవరణలో మంటలు



జూనియర్ కళాశాల ఆవరణలో చెలరేగిన మంటలు

ఉలవపాడు: ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న చెట్లకు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. క్లాస్ రూమ్స్ సమీపంలో వెనుకన పెద్ద చెట్లు ఉన్నాయి. వాటి పక్కనే రెండు చెట్లను కొట్టి వేయడంతో ఎండిపోయి ఉన్నాయి..ఎవరైనా సిగరెట్ కాల్చి వేయడంతో మంటలు ప్రారంభమై ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. మంటలు పెద్దవి కావడంతో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు వచ్చి మోటార్ల ద్వారా నీటిని కొట్టి మంటలు ఆర్పారు. కళాశాల సిబ్బంది తప్ప ఎవరూ అక్కడికి వెళ్లే పరిస్థితి లేదు. వాతావరణం కూడా చల్లగా ఉన్న సమయంలో మంటలు ఎలా వ్యాపించాయి అనేది అర్థం కావడంలేదు.

తెలుగుజాతి ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రంగ భూమి కళాకారుల సభ్యులు

ఒంగోలు మెట్రో: ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఒంగోలు రంగభూమి కళాకారుల సంఘ కార్యాలయ నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఘంటసాల విగ్రహ సాధన కమిటీ ప్రకాశం జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి రంగ భూమి కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో ఘంటసాల భారీ విగ్రహం ఏర్పాటు చేయడం వలన అంతర్జాతీయ ఖ్యాతి వస్తుందన్నారు. ఎన్టీఆర్, ఘంటసాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారతరత్న ప్రకటించాలని, హైదరాబాదులో ట్యాంక్ బండ్‌పై నిర్మించిన విధంగా రాజధాని అమరావతిలో కృష్ణా నదికి ఇరువైపులా తెలుగు జాతి ప్రముఖ సాహితీవేత్తలు, రచయితలు, కళాకారులు, మేధావుల విగ్రహాలు ఏర్పాటు చేసి అంతర్జాతీయ పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని కోట వెంకటేశ్వరరెడ్డి నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఘంటసాల విగ్రహ సాధన కమిటీ ఒంగోలు శాఖ కన్వీనర్ ఎస్‌కే బాబు, రంగభూమి కోశాధికారి కే సుబ్బయ్య, ఘంటసాల గాయని గాయకులు యు.కోటేశ్వరరావు, లక్ష్మీతులసి, నిర్మలమ్మ, యశోద, కృష్ణ, రంగారెడ్డి, హనుమంతరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి

ఒంగోలు టౌన్: జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను 2024–25 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేస్తూ వెంటనే ఉత్తర్వులివ్వాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 700 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయని, 3,629 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కాలేజీలలో కేవలం 1200 మంది మాత్రమే రెగ్యులర్ లెక్చరర్లు పనిచేస్తున్నారని, 67 శాతం కాంట్రాక్ట్ లెక్చరర్లతో కళాశాలలో బోధన జరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో 173 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా 630 మంది కాంట్రాక్టు అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. కళాశాలలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు రెన్యువల్ చేయలేదన్నారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేస్తూ ప్రతి ఏటా 10 రోజుల విరామంతో 12 నెలలు జీతాలిచ్చే విధంగా జీవో జారీ చేసిందని, అమలు చేయకుండానే వెళ్లిపోయిందని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ జీవో ప్రకారం జీతాలిచ్చిందని, 2023లో కాంట్రాక్టు లెక్చరర్లను పర్మినెంట్ చేస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపిందని, అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి గవర్నర్‌కు కూడా పంపించిందని, గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసిందని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లను రెన్యువల్ చేయడంతో పాటు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీగిరి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు మృతి



ఆలూరు జ్వాలా రామారావు (ఫైల్)

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండ మీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు (78) గురువారం ఉదయం హైదరాబాద్‌లోని స్వగృహంలో మృతి చెందారు. రోడ్లు, భవనాల శాఖలో ఉద్యోగంలో చేరి ఉన్నతాధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంతో పాటు ఆర్జిత సేవల ధర్మకర్తగా ఆలయాభివృద్ధికి విశేష సేవలందించారు. ఆలూరు మృతి తీరని లోటని శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝూన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, ఆలూరు జై శంకర్, శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, అర్చకులు, వేద పండితులు, దేవస్థాన సిబ్బంది, పలు రంగాల ప్రముఖులు ప్రగాఢ సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. ఆలూరు జ్వాలా రామారావు అంత్యక్రియలు శుక్రవారం హైదరాబాద్‌లో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య



గుడ్లూరులో భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు

గుడ్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా స్థాయి వసతులు కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రసాదరావు గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, రిజిష్టర్లను పరిశీలించారు. జూనియర్ ఇంటర్ తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ ఇంటర్‌లో ప్రథమ సంవత్సరం తరగతులు జూలై 2వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు. ఎంఈసీ, సీఈసీలలో తరగతులు నిర్వహిస్తారన్నారు. 10వతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు జూనియర్ ఇంటర్‌లో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం, కూరలు పరిశీలించి రుచి చూసి మెనూ ప్రకారం భోజనం తయారు చేయడంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలాగే ప్రతి రోజు మెనూ పాటించాలని, వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఈఓ వెంట ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్‌రావు ఉన్నారు.

అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పామూరు: మండలంలోని రఘునాథపురం, కమ్మవారిపాలెంలో అచ్చమాంబ పేరంటాళ్ల బ్రహ్మోత్సవాలు రుత్వికుల వేదమంత్రాల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం అర్చకులు ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ నిర్వహించారు. ఆదేవిధంగా అచ్చమాంబ మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజ చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి గ్రామోత్సవం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం నిర్వహించగా దేవస్థానాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు.